



గ్రీవెన్స్ సెల్‌లో వినతి పత్రాలు స్వీకరిస్తున్న కలెక్టర్ టిఎస్ చేతన్

క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కరించాలి

కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ టిఎస్ చేతన్ ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిఆర్ఒ విజయ సారథి, పుట్టపర్తి ఆర్‌డిఒ సువర్ణ, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాధాన్యత అంశాలపై శ్రద్ధ చూపాలన్నారు. జిల్లాలో మండల ప్రత్యేక అధికారులు వారానికి ఒక రోజు క్షేత్రస్థాయిలో పర్యటించి గ్రీవెన్స్ లో వచ్చిన అర్జీల సమస్యల పరిష్కారంపై ఆరా తీయాలన్నారు. డ్వామా, ఐసిడిఎస్, ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాలలో ఎలాంటి అక్రమాలు జరగకూడదని జరిగితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలలో మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో రైతు బజార్లు ఏర్పాటుకు మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు వెంటనే స్థల సేకరణ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈనెల 7న ప్రభుత్వం నిర్వహించే మెగా పేరెంట్స్ సమావేశాలను విజయవంతం చేయాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులను ఇందులో భాగస్వామ్యం చేయాలని తెలిపారు. జిల్లాలో గృహ నిర్మాణాల కొరకు ఆయా సచివాలయాల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఆధ్వర్యంలో దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయని అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సైనిక సంక్షేమ నిధికి చేయూతనందించండి

సైనిక సంక్షేమ నిధికి విరివిగా విరాళాలు అందించి చేయూతనివ్వాలని కలెక్టర్ టిఎస్ చేతన్ పిలుపునిచ్చారు. ఈనెల 7 నిర్వహించే సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈసందర్భంగా సాయుధ దళాల పతాక దినోత్సవానికి సంబంధించిన గోడపత్రికలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సైనిక సంక్షేమ జిల్లా అధికారి తిమ్మప్ప, సీనియర్ సహాయకులు గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

'పొగ'బారిన జీవితం..!

బీడీ కార్మికుల జీవనం పొగబారుతోంది. రోజంతా కష్టపడి పని చేసినా అందుకు తగ్గ కూలి లేక కుటుంబ పోషణ దుర్భరంగా మారుతోంది. రోజువారి కూలిపనులు చేసుకునే కార్మికులు నిరంతరం కష్టాల నడుమ జీవనం సాగిస్తున్నారు. రోజూ బీడీలు చుడితే గానీ పూట గడవని వీరంతా అరకొర వేతనాలతో ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్నారు. కార్మికుల సంక్షేమంపై ఏళ్ల తరబడి పాలకులు మాటలు చెప్పడం తప్పా ఆచరణలో వారిని ఆదుకునేందుకు చేసిన చర్యలు నామమాత్రమనే చెప్పాలి. బీడీ రంగాన్ని వ్యాపారంగా మార్చుకున్న వ్యాపారులు కోట్లకు పడగలెత్తుంటే దాన్ని నమ్ముకున్న కూలీలు మాత్రం కష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు. ఆర్థిక సమస్యలతో సహజీవనం చేస్తూ 'పొగ'బారిపోతున్న కదిరి బీడీ కార్మికుల కష్టాలపై ప్రజాశక్తి ప్రత్యేక కథనం...



- ◆ కష్టాల నడుమ బీడీ కార్మికులు
- ◆ ఆదాయం లేక చితికిపోతున్న బతుకులు
- ◆ కుటుంబ పోషణకూ అవస్థలు
- ◆ సంక్షేమంపై దృష్టి సారించని ప్రభుత్వాలు
- ◆ కార్మికుల కష్టాలు పట్టించుకోని యజమానులు

ప్రజాశక్తి-కదిరి టౌన్

కదిరి నియోజక వర్గ వ్యాప్తంగా చాలా మంది పేదలు బీడీ కార్మికులుగా జీవనం సాగిస్తున్నారు. దాదాపు 5 వేల మందికి పైగా కూలీలు బీడీలు చుడుతూ రోజు కూలిపై జీవనం సాగిస్తున్నారు. నిజాంవలీ కాలనీ, గాంధీనగర్, జౌకుపాళ్యం, వలీసాబ్ రోడ్డు ప్రాంతాల్లో బీడీ కార్మికులు ఉన్నారు. 30 సంవత్సరాలుగా ఈ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. బీడీ తయారీ కాంట్రాక్టర్, సబ్ కాంట్రాక్టర్, మున్షి వ్యవస్థ ద్వారా సాగుతుంది. వెయ్యి బీడీలు చుట్టేందుకు రూ.200 నుంచి రూ.250 కూలిగా ఇస్తుంటారు. ప్రస్తుతం చాలీచాలని కూలితో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు.

అందని 'సంక్షేమం'

బీడీ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమం దరి చేయడం లేదు. ఈ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు పిఎఫ్ ఉండడం లేదు. యజమానులు వారి వద్ద పని చేసే కార్మికుల సంఖ్యను ప్రభుత్వాలకు చూపడం లేదు. యజమాని, సబ్ కాంట్రాక్టర్ల బంధువుల పేర్లే రిజిస్టర్లలో ఉంటాయి. వాస్తవ కార్మికులు పేర్లు లేకపోవడంతో వీరికి పిఎఫ్, ఇఎస్ఐ తదితర వసతులు దక్కడం లేదు. ప్రభుత్వ పరంగా వీరికి గుర్తింపు కార్డులు అందించి ఆరోగ్యం, సామాజిక బాధ్యత, గృహ నిర్మాణం, విద్య, సంక్షేమ తదితర 20 పథకాలు కార్మికుల అమలు చేయాల్సి ఉన్నా పాలకులు పట్టించుకోవడం లేదు. జాతీయ స్కాలర్‌షిప్ కింద బీడీ కార్మికులకు అందాల్సిన సాయం అతికొద్ది మందికి మాత్రమే అమలవుతోంది. పిఎఫ్, ఇఎస్ఐ, సొంతిళ్లు, జాతీయ వేతన విధానం అమలు చేయాలని కార్మికులు కోరుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోని పరిస్థితి ఉంది. దీనిపై అధికారుల పర్యవేక్షణ కూడా పూర్తిగా కొరవడింది.

వెంటాడుతున్న అనారోగ్య సమస్యలు

ఎక్కువ రోజులుగా బీడీ కార్మికులుగా పని చేస్తున్న వారు అనారోగ్యం పాలవుతున్నారు. పొగాకు, ఆకుల ఘాటుతో టీబీ, ఆస్తమా తదితర దీర్ఘకాలిక వ్యాధులబారిన పడుతున్నారు. వీటితో పాటు వెన్నునొప్పి, కంటి చూపు తగ్గడం, నిద్రలేమి, మానసిక ఒత్తిడి, త్వరగా వద్ధాప్యం లాంటి సమస్యలకు గురవుతున్నారు. ఒక రంగా వారి ఆరోగ్యాన్ని ఫణంగా పెట్టి కుటుంబ జీవనం కోసం కార్మికులు ఈ వృత్తిలో కొనసాగుతున్నారు.

సంక్షేమ చట్టాల రద్దు..

బీడీ, సిగార్ చట్టం (1966), బీడీ కార్మికుల సంక్షేమ సెస్ చట్టం(1976)ను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. కార్మికులకు రక్షణగా ఉండాల్సింది పోయి వారికున్న కొద్దిపాటి సంక్షేమ పథకాలను రద్దు చేసేలా కేంద్రం వ్యవహరించింది. ఈ చట్టాల రద్దుతో బీడీ కార్మికులకు గతంలో వచ్చే పథకాలన్నీ అందకుండా పోయాయి. కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలనే నిబంధన ఉన్నా ఆచరణలో అది అమలుకు నోచుకోవడం లేదు. కూలి రేట్లు పెంచాలని కార్మికులు కోరుతున్నా యాజమానులు పట్టించుకునే పరిస్థితి లేదు. యజమానులు కోట్లు గడిస్తూ కార్మికులను మాత్రం నిర్లక్ష్యం చేస్తున్నారు. జాతీయస్థాయి ఏకరూప కనీస వేతన నోటిఫికేషన్ అమలు చేయాలని కార్మిక సంఘాల కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోని పరిస్థితి ఉంది.



ప్రభుత్వాలు దృష్టి సారించాలి



బీడీ రంగం పై ఆధారపడి జీవిస్తున్న కార్మికుల సంక్షేమంపై ప్రభుత్వాలు దృష్టి సారించాలి. యజమానులు కూలి రేట్లు పెంచి ఆదుకోవాలి. సంక్షేమ సెస్ పునరుద్ధరించడం ద్వారా బీడీ కార్మికులకు మేలు చేకూరుతుంది. బీడీ కార్మికులకు గుర్తింపు కార్డులు, పిల్లలకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలి. ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్మించుకున్న గృహాలకు వివిధ బ్యాంకులు, కార్పొరేషన్ల పరిధిలో ఉన్న బకాయిలను రద్దు చేయాలి. కార్మికులందరికీ ఈఎస్ఐ, పిఎఫ్‌ను వర్తింజేయాలి. ఈపీఎఫ్ పెన్షన్ రూ.5వేలకు పెంచాలి. బీడీ పరిశ్రమల పనిచేస్తున్న అన్ని కేంద్ర కార్మిక సంఘాల ప్రతినిధులతో సహా బీడీ కార్మికులకు సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి.

జిఎల్.నరసింహులు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు.



ఆర్డీవో ఆనంద్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న క్రీడాకారులు

ప్రభుత్వ క్రీడా వికాస కేంద్రాన్ని అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి-పెనుకొండ

ప్రభుత్వ క్రీడా వికాస కేంద్రాన్ని అభివృద్ధి చేయాలని కోరుతూ సోమవారం పలువురు క్రీడాకా రులు ఆర్డీవో ఆనంద్‌కుమార్‌కు వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ క్రీడా వికాస కేంద్రంలో క్రికెట్, టెన్నిస్, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, తదితర క్రీడల కోసం భవన నిర్మాణాలు చేపట్టారన్నారు. అయితే ఈ భవనాలు అసంపూర్తిగా ఉన్నాయని, ప్రభుత్వం నిధులు మంజూరు చేసి భవన నిర్మాణాలను పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాది రాజ్‌కమల్, రఘువీరా చౌదరి, లింగారెడ్డి, జాన్, నంజుండ, సునీల్, అమర్నాథ్‌రెడ్డి, బాలాజీ, మూర్తి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'ప్రజాదర్బార్' : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-గుడిబండ

ప్రజల సమస్యలు పరిష్కరించి అండగా ఉంటామని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో సోమవారం వారు అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి 'ప్రజాదర్బార్' నిర్వహించారు. వారు మాట్లాడుతూ వైసిపి ప్రభు త్వం ప్రజా సమస్యలను గాలికి వదిలేసి, అవినీతి, అక్రమాలకు పాల్పడిందన్నారు. కూటమి అధికారం లోకి వచ్చిన అనతికాలంలోనే అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిఎం చంద్రబాబు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాదర్బార్‌ను ప్రజలు సద్విని యోగం చేసుకోవాలన్నారు. ఉదయం నుంచి వర్షం కురుస్తున్నా ప్రజలు లెక్కచేయక వినతులు అందజేశారు. దశల వారీగా ఆయా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్ర మంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, రాష్ట్ర వక్కలిగ సాధికార సమితి అధ్యక్షులు పాండు రంగప్ప, అధికారులు, టిడిపి మండల కన్వీనర్ శివకుమార్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మంజునాథ్, వీరశైవ లింగాయత్ జిల్లా అధ్యక్షులు దుర్గేష్, లక్ష్మీ నరసప్ప, భీమరాజు, లక్ష్మీ నారాయణప్ప, నజీర్, మండల కార్యదర్శి ప్రకాష్, ఆదినారాయణ, బూదిపల్లి జయరామప్ప పాల్గొన్నారు.



ప్రజాదర్బార్‌లో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

హంద్రీనీవా కాలవ ద్వారా చెరువులకు నీరివ్వాలి

మడకశిర : హంద్రీనీవా కాలువ ద్వారా నియోజకవర్గంలోని చెరువులకు వెంటనే నీరందించ డానికి అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు తెలిపారు. పట్టణంలోని ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్‌లో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి అధ్యక్షతన ఇంజినీర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి హంద్రీనీవా బ్రాంచ్ కెనాల్ ద్వారా మడకశిరకు త్వరగతిన సాగునీరందించాలన్నారు. బ్రాంచ్ కెనాల్‌ను పటిష్టం చేసి ముళ్లపొదలు తొలగించాల న్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి , కుంచితి ఒక్కలిగా రాష్ట్ర కన్వీనర్ వి.ఎం.పాండురంగప్ప, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, నాయకులు, అధికారులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా మండలంలోని పాపసనిపల్లి వెంకటసుబ్బారెడ్డి టిడిపి జీవితకాల సభ్యత్వం తీసుకున్నారు.

గొల్లపల్లి పంప్ హౌస్ పరిశీలన

ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మండలం లోని గొల్లపల్లి పంప్‌హౌస్‌ను పరిశీలించారు. ఎమ్మెల్యే విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 2014–19లో అప్పటి టిడిపి ప్రభు త్వం మడకశిర వరకూ కృష్ణా జలాలు తీసుకొచ్చిందన్నారు. 2019 నుంచి వైసిపి ప్రభుత్వం కాలువ నిర్వహణను గాలికి వదిలేసిందని, నియోజకవర్గంలో ఏ ఒక్క చెరువునూ నింపలేదన్నారు. కూటమి ప్రభుత్వం చివరి ఆయకట్టు వరకూ కృష్ణా జలాలు చేరేలా పనులు వేగవంతం చేసిందని, నియోజక వర్గంలోని అన్ని చెరువులను నింపుతామన్నారు. వారి వెంట టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి, మండల కన్వీనర్లు లక్ష్మీనారాయణ, దాసిరెడ్డి, హంద్రీనీవా ఇంజినీర్లు, నాయకులు ఉన్నారు.

అదానీ, జగన్‌ను అరెస్ట్ చేయాలి : కాంగ్రెస్

ప్రజాశక్తి-హిందూపురం

సౌర విద్యుత్ కొనుగోలులో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆదాని, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని వెంటనే అరెస్ట్ చేయాలని రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఇన్‌ఛార్జి మమత, రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లక్కరాజురామరాజు మాట్లాడుతూ, అదాని సౌర విద్యుత్ కొనుగోలులో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి రూ.1750 కోట్ల ముడుపులుగా చెల్లించారని దర్యాప్తు సంస్థలు బయట పెట్టయన్నారు. అదాని తన పోర్టుల ద్వారా ఆఫ్రికా వంటి దేశాలకు లక్ష మెట్రిక్ టన్నుల బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్నారని, దీనిపై ప్రభుత్వాలు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వ సంస్థలన్నీ ప్రైవేటుపరం చేస్తూ కార్పొరేటర్లకు కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఆరు నెలలు గడచినప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో వైఫల్యం చెందిందని విమర్శించారు. సర్‌ఛార్జ్ పేరుతో విద్యుత్ వినియోగదారులపై వందల కోట్ల రూపాయల భారం మోపారని అన్నారు. , రాష్ట్రంలో యువత గంజాయి మత్తులో పడి తమ భవిష్యత్తును బుగ్గి చేసుకుంటోందనిదీనిపై ప్రభుత్వాలు వెంటనే చర్యలు తీసుకొని యువత సరైన దారిలో నడిచేలా చూడాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకుడు సంపత్ కుమార్ ను హత్య చేసిన నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో స్థానిక యువజన కాంగ్రెస్ నాయకులు శ్యామ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



అదానీ, జగన్‌ను అరెస్ట్ చేయాలని పోస్టర్లు ప్రదర్శిస్తున్న యువజన కాంగ్రెస్ నాయకులు

ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-గుడిబండ

అంతర్జాతీయ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక జడ్పీ హైస్కూల్‌లో ఆర్‌డిటి సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఆర్‌డిటి ఎటిఎల్ మీనాక్షి మాట్లాడుతూ ఎయిడ్స్ సంక్రమణ, లక్షణలు, జాగ్రత్తలు, మందులు, తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం గోవిందప్ప, ఉపాధ్యాయులు నరసింహమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

హెచ్ఎం సస్పెన్షన్ సమంజసం కాదు : యుటిఎఫ్

ప్రజాశక్తి-మడకశిర

మండలంలోని అమిదాలగొంది జడ్పీ హైస్కూల్ హెచ్ఎంను సస్పెండ్ చేయడం సమంజసం కాదని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయ చంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ తెలిపారు. పట్టణంలో సోమవారం వారు మాట్లాడుతూ విద్యార్థి కిడ్నాప్, హత్య ఘటనను తీవ్రంగా ఖండించారు. విద్యార్థి కుటుంబానికి ప్రగాడ సానుభూతి తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దుర్ఘటనలు చోటు చేసుకోవడం దురదృష్టకరం అన్నారు. అయితే ఈ విషయంలో ఎలాంటి సంబంధంలేని హెచ్ఎంను ఉన్నతాధికారులు సస్పెండ్ చేయడం సమంజసం కాదన్నారు. వెంటనే హెచ్ఎంపై సస్పెన్షన్ ఎత్తి వేయా లని, పిఇటి షోకాజ్ నోటీసును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.భూతన్న, ఉపాధ్యక్షులు జిహెచ్.బాబు, సహాధ్యక్షురాలు సీతామహలక్ష్మి, కోశాధికారి డి.శ్రీనివాసులు, రాష్ట్ర కౌన్సిలర్లు మారుతిశ్రీనివాస్, మేరీ వరకుమారి, జిల్లా కార్యద ర్శులు, తాహిర్‌వలి, సుబ్బా రెడ్డి, నరేష్‌కుమార్, శివ కుమార్, లక్ష్మీనారా యణ, నర్సింగప్ప, అనిల్‌కు మార్, లతాదేవి, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ మహం తేశ్వర పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భూతన్న



సిఐటియు ఆధ్వర్యంలో మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న యానిమేటర్లు

యానిమేటర్లను విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి-గోరంట్ల

మండలంలోని ఐకెపి కార్యాలయంలో తొలగించిన యానిమేటర్లను తక్షణమే విధుల్లోకి తీసుకో వాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సిఐటియు జిల్లా కోశాధికారి సాంబశివ, భవన నిర్మాణ కార్మిక సంఘం నియోజకవర్గ కన్వీనర్ కొండా వెంకటేష్ ఆధ్వర్యంలో యానిమేటర్లు స్థానిక ఐకెపి కార్యాలయం ముందు యానిమేటర్లు మోకాళ్లపై నిరసన తెలిపారు. నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో 15 ఏళ్లుగా గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఐకెపి యానిమేటర్ల ను తొలగించడం దారుణ మన్నారు. ఈ విషయంపై యానిమేటర్లు హైకోర్టులో పిటిషన్ వేయగా యానిమేటర్లకు ఆటకం కలిగించకుండా పనిచేసేలా హైకోర్టు ఆర్డర్ ఇచ్చిందన్నారు. కోర్టు ఆర్డర్‌ను ఐకెపి ఎపిఎంకు ఇవ్వడానికి వెళ్లగా ఆమె అందుబాటులో లేదన్నారు. అలాగే ఆఫీసులో ఎవరికి ఇద్దా మన్నా అందుబాటులో లేరని, యానిమేటర్లను తక్షణమే విధుల్లోకి చేర్చుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి-సోమందేపల్లి

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం జిల్లా ప్రోగ్రాం అధికారి నివేదిత సందర్శించి వైద్యసేవలు, ఇతర విషయాలపై వైద్యాధికారి ఓంకార్‌తో చర్చించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన రాష్ట్ర బాల్య స్వస్థ, అసంక్రమిత వ్యాధుల కార్యక్రమాలపై వైద్యాధికారులు, వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.

టిడిపి కార్యకర్తకు మంత్రి పరామర్శ

ప్రజాశక్తి-సోమందేపల్లి

సోమందేపల్లికి చెందిన టిడిపి కార్యకర్త కోతుల ప్రసాద్ ఇటీవల ఓ ప్రమాదంలో గాయపడి కాలికి చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈ విషయం తెలిసి సోమవారం మంత్రి సవిత వారింటికి వెళ్లి పరామర్శించారు. రూ. 20వేలు ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం సమీపంలోని అయ్యప్పస్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్పస్వామి మాలధారణ భక్తులు మంత్రిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ సిద్దలింగప్ప, పట్టణ అధ్యక్షులు వడ్డే సూరి, మాజీ జడ్పిటిసి వెంకటరమణ, నీరుగంటి చంద్ర, కోతుల మూర్తి, మాజీ ఎంపీటీసీ కిష్టప్ప, సూర్యనారాయణ, డివి.ఆనంద్, శివప్ప, జనసేన నాయకులు జబీవుల్లా, నాగరాజు, ఎర్రిస్వామి పాల్గొన్నారు.

'చెత్త రాజకీయాలు మానుకో..'

ఉషశ్రీచరణ్‌కు ముస్లింల హితవు

ప్రజాశక్తి-పెనుకొండ

నియోజకవర్గంలో వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ మతాల మధ్య చిచ్చు రేపుతోందని పెనుకొండ ముస్లిం మైనార్టీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో సోమవారం మైనార్టీ నాయకులు నదీముల్లా (దాదు) ఆధ్వర్యంలో ముస్లింలు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న జామియా మసీదు స్థలంలో టిడిపి కార్యకర్త రియాజ్ 15 ఏళ్లుగా రేకుల షెడ్డు వేసుకుని ద్విచక్ర వాహనాల మరమ్మతులు చేసుకుని జీవనం సాగిస్తున్నార న్నారు. అయితే రియాజ్ పై వైసిపి నాయకులు కక్ష గట్టి దాడులకు పాల్పడడంతో పాటు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బాధితునికి అండగా నిలిచిన వారిపై అసత్య ప్రచారం చేయడం తగద న్నారు. ఇకనైనా ఉషశ్రీచరణ్ చెత్త రాజకీయాలు మానుకోవా లని హితవు పలికారు. సమావేశంలో రియాజుద్దీన్, షౌకత్, సనా, నిసార్, షమీ, ఫయాజ్, ఇర్ఫాన్, అస్లాం, షమ్మున్, నజీర్, సలాం, షఫీ పాల్గొన్నారు.

దళిత కాలనీ సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి-కొత్తచెరువు రూరల్

మామిళ్ల కుంట క్రాస్ లోని దళితవాడ లో మౌలిక వసతుల కల్పనకు అధికారులు చర్యలు చేపట్టారు. కాలనీలో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వ్యకాసం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహిస్తారని తెలుసుకున్న పంచాయతీ సిబ్బంది సోమవారం ఉదయం మామిళ్ళకుంట క్రాస్ దళితవాడకు చేరుకుని మౌలిక వసతులను కల్పనకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా గ్రామ పంచా యతీ కార్యదర్శి నాగరాజు, ఎలక్ట్రీషియన్ నర్సింహు లు వీధిలైట్లు వేయడానికి కాలనీలో పర్యటించి కాలనీవాసులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పెద్దన్న, వెంకటేశులుతో మాట్లాడారు. వీధిలైట్లు ఏర్పాటు చేయుటకు చర్యలు తీసుకు న్నారు. ఈ సందర్భంగా నాయకులు, కాలనీవాసులు స్థానిక సమస్యలను పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రధానంగా రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని మురుగుకాలువలు నిర్మించాలని కోరారు. అధికారులు స్పందించడంతో ధర్నా కార్యక్ర మాన్ని ఉపసంహరించుకుంటున్నట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, జిల్లా కోశాధికారి సాకే వెంకటేశ్వర్లు, స్థానికులు రమాదేవి , భాగ్యమ్మ , లక్ష్మమ్మ, వెంకటేశులు పాల్గొన్నారు.



దళిత కాలనీలో పర్యటించిన సిఐటియు నాయకులు

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

ప్రజాశక్తి-గోరంట్ల రూరల్

మండలంలోని గుమ్మయ్యగారిపల్లిలో సోమవారం పోలీసులు, ఐసిడిఎస్, పంచాయతీ అధికారులు ఓ బాల్య వివాహాన్ని అడ్డుకున్నారు. అధికారులు తెలిపిన వివరాలు.. గుమ్మయ్యగారి పల్లికి చెందిన ఓ మైనర్ బాలికకు తల్లిదండ్రులు వివాహం చేయడానికి నిశ్చయించారు. ఈ విషయం తెలుసుకున్న ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రజిత, పంచాయతీ కార్యదర్శులు సౌమ్య, లక్ష్మీప్రసన్న, మహిళా పోలీస్ ఎంఎం.గ్లోరీ, అంగన్వాడీ వర్కర్లు విజయమ్మ, పద్మ ఆ గ్రామం వెళ్లారు. ఇరు కుటుంబాల వారికి కౌన్సెలింగ్ ఇచ్చి బాల్య వివాహాన్ని ఆపి వేయించారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ మాట్లాడుతూ ఈ బాలిక పుట్టపర్తి గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతోందన్నారు. బెంగళూరులోని ఓ ప్రయివేటు సంస్థలో పని చేస్తున్న యువకుడితో వివాహం నిశ్చయించారన్నారు. ఈ విషయం తెలిసి చట్ట ప్రకారం బాల్య వివాహం చేయకూడదని ఇరువురి తల్లిదండ్రులకు వివరించి వారి పెళ్లిని ఆపి వేయించామని తెలిపారు. అనంతరం ఆమె ఫోన్ ద్వారా విషయం తెలుపగా ఒకటి, రెండు రోజుల్లో బాలికను తిరిగి స్కూల్‌లో చేర్పిస్తామని ఎంఇఒ తెలిపారు.



ఇరు కుటుంబాల సభ్యులకు కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు

సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - నల్లచెరువు

జిల్లా బంజారా పాస్టర్స్ సెమీ క్రిస్మస్ సోమవారం స్థానిక సిఎస్ఐ చర్చిలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న క్రిష్టియన్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ జాషువా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

స్థానిక ప్రశాంతి గ్రామం సమీపంలోని వేద పాఠశాల విద్యార్థులకు దుప్పట్లను సోమవారం పంపిణీ చేశారు. గోరంట్ల పట్టణానికి చెందిన బైసాని శ్రీనివాస్ గుప్త, అన్నపూర్ణ ఆదినారాయణ ఆర్థిక సాయంతో ప్రశాంతి గ్రామం ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు దేవంగం జగదీశ్వర ఆధ్వర్యంలో వేదపాఠశాల విద్యార్థులకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కేశవ స్వామి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలపై అవగాహన

ప్రజాశక్తి-నంబులపూలకుంట

స్థానిక కెజిబివి విద్యార్థినులకు బాల్య వివాహాలపై కదిరి రూరల్ సిఐ నాగేంద్ర అవగాహన కల్పించారు. పాఠశాలలో సోమవారం నిర్వహించిన సమావేశంలో విద్యార్థినులకు పలు సూచనలు చేశారు. బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వలిబాషా, ఇన్‌ఛార్జి ఎస్ఒ రూపారాణి, స్థానిక పోలీసులు నరసింహ మూర్తి పాల్గొన్నారు.

సిసి రోడ్డు పనుల పరిశీలన

ప్రజాశక్తి - తలుపుల

మండల పరిధిలోని పెద్దన్నవారిపల్లి, కాయలపల్లిలో జరుగుతున్న సిసి రోడ్డు పనులను ఎంపీడీవో రామా నాయక్ పరిశీలించారు. అలాగే కాయలపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న క్యాటిల్‌షెడ్‌ను పరిశీలించారు.కొత్త పూలవాండ్లపల్లి అంగన్వాడీసెంటర్‌కు నీటి వసతి కల్పించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వేపమానిపేట గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి సిబ్బంది హాజరును పరిశీలించారు.

సాగునీటి సంఘం ఎన్నికలపై శిక్షణ

ప్రజాశక్తి - గాండ్లపెంట

సాగునీటి సంఘం ఎన్నికల నిర్వహణపై ఒక్కరోజు శిక్షణా కార్యక్రమాన్ని స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. అధికారులతో నిర్వహించిన ఈ శిక్షణలో తహశీల్దార్ బాబురావు, ఇరిగేషన్ జెఇ అరుణ మాట్లాడుతూ మండలంలో పోరెడ్డి చెరువు కింద ఆయకట్టు దారులు దాదాపు 85 మంది ఉన్నారని తెలిపారు. 5వ తేదీన నోటిఫికేషన్ జారీ చేసి 8వ తేదీన ఎన్నికలను స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు చెప్పారు. అదే రోజు ఎన్నికల ఫలితాలు అధ్యక్షుడి ఎన్నిక ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు బదిలీ సాధారణం

ప్రజాశక్తి - బత్తలపల్లి

ప్రభుత్వ అధికారులకు బదిలీలు సాధారణమని బత్తలపల్లి ఎస్ఐ సోమశేఖర్ అన్నారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన సమావేశంలో బదిలీపై రామగిరి పోలీస్ స్టేషన్కు వెలుతున్న కోర్టు కానిస్టేబుల్ బాలకృష్ణను సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బదిలీలు సర్వసాధారణమన్నారు. ఎక్కడైనా విధి నిర్వహణ ఒక్కటేనని అన్నారు. చేసే మంచి పనులతో ప్రజల్లో గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ సోమశేఖర్, తిరుపాలు, సిబ్బంది ఓబులేసు, జనార్ధన్, మురళి, ఆంజనేయులు, రామాంజనేయులు, హోంగార్డులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ అధ్యాపకులకు డాక్టరేట్

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

ధర్మవరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల భౌతిక, గణిత అధ్యాపకులు మల్లికార్జున,ప్రదీప్ కుమార్ డాక్టరేట్ పొందారని కళాశాల ప్రిన్సిపల్ సురేష్ బాబు తెలిపారు.తమ కళాశాల అధ్యాపకులకు డాక్టరేట్ రావటం అభినందనీయమన్నారు. అధ్యాపకులు మల్లికార్జున మాట్లాడుతూ ఆర్గానిక్ డై ఇంటడక్టర్ లేయర్‌ను ఉపయోగించి ఎన్డీఈ ఆధారిత సేంద్రీయ ఆకర్షణ హెటరో స్ట్రక్చర్ కారక్టరైజేషన్ అనే అంశంపై పరిశోధన చేసినందుకు డాక్టరేట్ ప్రదానం చేశారన్నారు. గణిత అధ్యాపకులు ప్రదీప్ కుమార్ హిట్ ట్రాన్స్‌ఫర్ ఎనాలసిస్ ఆఫ్ హైబ్రిడ్ నానో ఫ్లూయిడ్స్ విత్ రేడియేషన్ అండ్ ఎంహెచ్‌డిపై చేసిన పరిశోధనకు యోగివేమన విశ్వవిద్యాలయం వారిచే డాక్టరేట్ పొందినట్లు చెప్పారు.

కొత్త రేషన్‌కార్డులకు అందని మార్గదర్శకాలు



హిందూపురంలోని సచివాలయం

ప్రజాశక్తి-హిందూపురం

కూటమి ప్రభుత్వం కొలువు దీరిన ఆరవ నెలలో అర్హులైన వారికి నూతన కార్డుల పంపిణీ ప్రక్రియను డిసెంబర్ 2 నుంచి ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యే స్థాయి నుంచి ముఖ్యమంత్రి వరకు గత కొన్ని రోజులుగా ఊదరగొట్టారు. ఈ ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభం కావాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు ఆయా సచివాలయాలకు దరఖాస్తులకు సంబంధించి మార్గదర్శకాలు అందలేదు. దీంతో రేషన్ కార్డు లేని వారు దరఖాస్తులు చేసుకోవడానికి సచివాలయాలకు వెళ్లి నిరాశతో వెను తిరగాల్సిన పరిస్థితి నెలకొంది.

అర్హులైన వారికి ప్రభుత్వం కొత్తగా రేషన్ కార్డుల మంజూరు కోసం సోమవారం నుంచి దరఖాస్తులను తీసుకుని, సంక్రాంతికి కానుకగా నూతన కార్డులు అందించాలని ప్రణాళికలు సిద్ధం చేసుకుంది. దీంతో పాటు ప్రస్తుతమున్న రేషన్ కార్డులలో చేర్పులు మార్పులకు, అవకాశం కల్పించింది. రేషన్ కార్డుల దరఖాస్తు తో పాటు కొత్తగా పింఛన్ల కోసం దరఖాస్తులను స్వీకరించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో వీటికి సంబంధించి ఇప్పటికే ప్రభుత్వం ఆయా కార్యాలయాలతో పాటు సచివాలయాలకు మార్గదర్శకాలను జారీ చేయాల్సుంది. అయితే ఇప్పటిదాకా మార్గదర్శకాలు విడుదల కాలేదు. గత ప్రభుత్వం కొత్తగా రేషన్ కార్డులు మంజూరు చేయకపోవడంతో ఉమ్మడి జిల్లాలో ఎంతో మంది వాటికోసం ఎదురు చూస్తున్నారు. కొత్తగా వివాహమైన వారు, కార్డులలో తొలగింపులు, చేర్పులు, మార్పులు చేయాల్సిన వారు వేల సంఖ్యలో ఉన్నారు. ఇటువంటి వారందరూ దరఖాస్తులు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. అయితే దీనికి సంబంధించి సర్వర్ ఇప్పటి వరకు అందుబాటులో రాలేదు. అర్హులైన వారు దరఖాస్తులు తీసుకొని సచివాలయాలకు వెళ్లారు, ఇంకా మార్గదర్శకాలు రాలేదని సచివాలయ సిబ్బంది వారికి చెప్పడంతో వారు తహశీల్దార్ కార్యాలయానికి వెళ్తున్నారు. నూతన రేషన్ కార్డు, చేర్పులు, మార్పుల ప్రక్రియ మొత్తం సచివాలయాల్లోనే జరుగుతుందని అక్కడే దరఖాస్తులను చేసుకోవాలని అక్కడి అధికారులు వారిని తిరిగి పంపించేస్తున్నారు. ఇలా లబ్ధిదారులు సచివాలయం, తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో నూతన రేషన్ కార్డుల ప్రక్రియ కొనసాగలేదు. కనీసం

సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు
ప్రారంభం కాని కొత్త కార్డుల ప్రక్రియ

కార్డుల్లో చేర్పులు, మార్పులు చేసుకోవడానికి సైతం అవకాశం కల్పించలేదు. దీంతో ఎంతోమంది రేషన్ అందగా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇంట్లో తల్లిదండ్రుల పేరులో రేషన్ కార్డు ఉండి, ఆ కార్డులో ఉన్న ఆడబిడ్డలకు ఉద్యోగం రావడంతో వారి తల్లిదండ్రులకు అందే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని పరిస్థితి నెలకొంది. ఆ ఉద్యోగినీలు వివాహం చేసుకొని అత్తారింటికి వెళ్లినప్పటికీ రేషన్ కార్డుల్లో వారి పేర్లు ఉన్నాయన్న కారణంతో నేటికీ పుట్టింటి వారికి సంక్షేమ పథకాలు అందడం లేదు. వీటితోపాటు అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు చేసిన వారి తల్లిదండ్రులను కూడా పింఛను ఇతర సంక్షేమ పథకాలకు అనర్హులను చేశారు. అలాంటి వారందరికీ కొత్తగా అవకాశం కల్పిస్తామని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. దీంతో ఎంతో ఆశతో దరఖాస్తు చేసుకునేందుకు సచివాలయాలకు వెళుతున్న వారికి నిరాశే మిగిలింది. సర్వర్ అందుబాటులోకి రాకపోయినప్పటికీ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని ఆఫ్ లైన్ ద్వారా దరఖాస్తులను తీసుకుని, పరిశీలన చేసి సిద్ధంగా పెట్టుకుంటే సర్వర్ అందుబాటులోకి వచ్చిన వెంటనే అర్హులైన వారికి రేషన్ కార్డు తో పాటు సామాజిక పింఛన్లు సైతం అందించడానికి అవకాశాలు ఉన్నాయి.

104 సిబ్బంది సమస్యలను పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్



విలేకరుల సమావేశంలో పాల్గొన్న నాయకులు

104 కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక సిఐటియు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కన్వీనర్ జెవి, రమణ ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న, సిఐటియు మండల కో కన్వీనర్ అయూబ్ ఖాన్, సిఐటియు నాయకులు జంగమన్న మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 104 ఉద్యోగులు దాదాపుగా నెల రోజులుగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. గత 16 సంవత్సరాలుగా 104 కార్మికులు ప్రజలకు నిరంతరం సేవలందిస్తున్నారన్నారు. వారి సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం కన్పించలేదని విమర్శించారు. ప్రధానంగా వారికి కనీస వేతనం అమలు చేయాలన్నారు. వారిని రెగ్యులర్ చేయాలని, ప్రతి నెల వేతనాలు ఇవ్వాలని, వాహనాల రిపేర్లు ప్రభుత్వమే చేయించాలని కోరారు.

ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వద్దు : ఎస్పీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్


ఎస్పీకి సమస్యను విన్నవిస్తున్న మహిళ

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదులను తక్షణం పరిష్కరించాలని శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ రత్న పేర్కొన్నారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం "ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం)" కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించి అర్జీదారులతో ఎస్పీ ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలు సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్లో మాట్లాడి సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలని, బాధితులకు చట్ట పరిధిలో తక్షణ న్యాయం అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ తో పాటు అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, లీగల్ అడ్వైజర్ సాయినాథ్ రెడ్డి , డిసిఆర్‌బి సిఐ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

కోర్టు ఉత్తర్వులను అమలు చేయాలి : సిఐటియు


అధికారులతో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు


ఎపిఎంకు వినతిని ఇచ్చి సమస్యను వివరిస్తున్న సిఐటియు నాయకులు, యానిమేటర్లు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

విఓఎల విధులకు ఆటంకాలు, తొలగింపులకు గురి చేస్తున్న సిసిలపై చర్యలు తీసుకొని విఓఎలకు న్యాయం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు విఓఎలు తమ వ్యక్తిగత వినతిపత్రాలను పుట్టపర్తి ఏసీ క్లస్టర్ పద్మావతికి, కొత్తచెరువు ఎపిఎం నారాయణకి సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం అందజేశారు. ఈసందర్భంగా ఇఎస్ వెంకటేష్ మాట్లాడుతూ ఎస్సీ ,ఎస్టీ, బీసీ, ఓసి/మైనార్టీ వర్గానికి చెందిన 10 నుండి 18 సంవత్సరాలుగా విఓఎలను విధులు నుండి తప్పు కోవాలని సిసిలు వేధింస్తున్నారని విమర్శించారు. వారి విధి నిర్వహణకు అడ్డు పడుతూ వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. విఓఎలకు మరింత భయం కలిగే విధంగా విఓఎల ప్రభుత్వ వెబ్ సైట్ నుండి వారి పేర్లను తొలగించారని విమర్శించారు. గ్రామైక్య సంఘాల గ్రూపుల్లో బలవంతంగా విఓఎల తొలగింపునకు తీర్మానాలు చేయించేందుకు దగ్గరుండి కొంత మంది సీ సీ లు సహకారం అందిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిసిలు అధికార పార్టీ నాయకుల కోసం పనిచేస్తూ విఓఎలను విధులకు దూరం చేస్తూ సంఘాల మినిట్స్ రిజిస్టర్లు ఇవ్వాలని వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. సంఘాల ఆర్థిక లావా దేవీలకు (పొదుపు , అప్పులు చెల్లింపులు) సీసీలు బ్యాంక్ అధికారులకు ఫోన్ చేసి సంబందిత విఓఎలను తొలగించామని వారికి సహకరించవద్దని మాట పూర్వకంగా తెలపడం బాధాకరమన్నారు. సీసీలు విఓఎల విధుల పట్ల ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటూ గ్రామైఖ్య సంఘాల అనుమతులు విఓఎల నియమ నిబంధనలకు ప్రభుత్వ సూచనలకు పట్టించుకోకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. వారి విధులకు ఆటంకాలు , తొలగింపు చర్యలు మానుకొని ఉద్యోగ ఉపాధికి భద్రత కల్పిస్తూ న్యాయం చేయాలని, గౌరవ హైకోర్టు ఉత్తర్వులు, సర్ఫ్ సిఒ ఇచ్చిన సర్క్యులర్, జిల్లా పీడీ ఇచ్చిన సర్క్యులర్లను వినతిపత్రాలకు జత చేసి ఇచ్చినట్లు చెప్పారు. సిసిలు ఇదే విధంగా వ్యవహరిస్తే వ్యక్తిగతంగా కంటెంట్ కు వెళ్లి పోరాటాన్ని కొనసాగిస్తామని విఓఎలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బాల్లఅంజి, విఓఎల సంఘం జిల్లా కో కన్వీనర్ వెంకట్రాముడు, సుజాత, అశ్వని, రామాంజనమ్మ, ప్రసాదు, ఆదిశేష రెడ్డి, జయరాం తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : రాష్ట్ర అత్యున్నత స్థానం ఇచ్చిన తీర్పును వెంటనే అమలు చేసి, తొలగించిన విఒఎలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్ పి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. తొలగించిన యానిమేటర్లను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తు సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో యానిమేటర్లు స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేశారు. అనంతరం ఎపిఎం రామాంజనేయులుకు వినతిని ఇచ్చి, సమస్యను వివరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతు హిందూపురం రూరల్ మండలంలో వెలుగు ప్రాజెక్టు పరిధిలో విధులు నిర్వహిస్తున్న 10 మంది యానిమేటర్లకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా తొలగించారన్నారు. అధికారులు అధికార పార్టీ నాయకులకు అనుకూలంగా పనిచేస్తున్నారని విమర్శించారు. ఈవిషయంపై న్యాయ స్థానాన్ని ఆశ్రయించగా తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని తీర్పు ఇచ్చిందన్నారు. తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోక పోతే మళ్లీ కోర్టును ఆశ్రయించడంతో పాటు ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ నాయకులు రాము, యానిమేటర్లు బైలప్ప, అశ్వర్థ రెడ్డి, అంజన రెడ్డి, మహేంద్ర, నాగేంద్ర, విజయ్ కుమార్, ఆనంద్, జంగాలపల్లి సరస్వతి, రాచపల్లి గాయత్రి, వివర్స్ కాలనీ శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయులకు ఇళ్లపట్టాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పాత్రికేయులకు ప్రభుత్వం తరపున ఇంటి స్థలాల పట్టాలు మంజూరు చేయాలని స్థానిక విలేకరులు కోరారు ఈ మేరకు వారు సోమవారం రెవెన్యూ కార్యాలయంలో జరిగిన ఫిర్యాదుల పరిష్కార వేదికలో తహశీల్దార్ వెంకటేశకు వినతిపత్రం సమర్పించారు. స్థానిక ప్రెస్ క్లబ్ కమిటీ ఆధ్వర్యంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు మాట్లాడుతు గత కొన్ని సంవత్సరాలుగా పాత్రికేయ రంగంలో ఉంటూ ఇటు ప్రభుత్వానికి అటు ప్రజలకు వారిధిగా పనిచేస్తూ సమాజానికి ఎంతగానో తోడ్పాటును అందిస్తున్నామన్నారు, అయితే సొంత ఇల్లు లేక పోవడంతో అద్దె ఇళ్లలో కాపురం ఉంటూ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి తమకు ఉండడానికి ప్రభుత్వ స్థలం, పక్కాగృహం మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు పాల్గొన్నారు.

కాలుష్యాన్ని అరికడదాం

హరీష్ పాఠశాల ప్రిన్సిపల్ కిరణ్

ప్రజాశక్తి - కదిరిటౌన్

ప్రతి ఒక్కరూ కాలుష్య నివారణకు కృషి చేద్దామని ప్రిన్సిపల్ కిరణ్ తెలిపారు. కదిరి రూరల్ పరిధిలోని ఎరుకలవాండ్లపల్లి సమీపంలో ఉన్న హరీష్ పాఠశాలలో సోమవారం ప్రపంచ కంప్యూటర్ అక్షరాస్యత, జాతీయ కాలుష్య నివారణ దినోత్సవాన్ని ప్రిన్సిపల్ కిరణ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కంప్యూటర్ వాడకంపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రస్తుతం ఏ రంగంలో ఉద్యోగం పొందాలన్నా కంప్యూటర్ వాడకంపై అవగాహన ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ కంప్యూటర్ వాడకంలో నైపుణ్యం కలిగి ఉండాలని సూచించారు. అదేవిధంగా ప్రతి ఒక్కరూ కాలుష్య రహిత సమాజం కోసం కృషి చేయాలన్నారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. ఈ సందర్భంగాకంప్యూటర్, కాలుష్య నివారణ అంశాలపై విద్యార్థులు చేసిన పరికరాలు, డ్రాయింగ్ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంను సస్పెండ్ చేయడం తగదు

ప్రజాశక్తి - కొత్తచెరువు

మడకశిర మండలం ఆమిదాలగొంది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులును సస్పెండ్ చేయడం తగదని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జయచంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ పేర్కొన్నారు. ఈనెల 28వ తేదీ పాఠశాల విరామ సమయంలో విద్యార్థిని అతనిమేనమామ తీసుకొని వెళ్లి హత్య చేయడం దురదృష్టకరమని ఈ సంఘటనని ఖండిస్తున్నామన్నారు. ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోవడం బాధాకరమన్నారు. అయితే ఈ ఘటనలో ఎటువంటి సంబంధం లేని ప్రధాన ఉపాధ్యాయులును సస్పెండ్ చేయడం తగదదన్నారు. ఈ పాఠశాలకు 438 మంది విద్యార్థులు ఉన్నారని చెప్పారు. బోధనేతర పనులకు ఇతర సిబ్బంది ఒకరు కూడా లేరని ప్రధాన ఉపాధ్యాయుడు ఉపాధ్యాయులే అన్ని పనులు చేసుకోవాలన్నారు. హెచ్‌ఎం సస్పెన్షన్‌ను, పిఇటికి ఇచ్చిన షోకాజ్ నోటీసును వెంటనే ఎత్తివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు భూతన్న, యుటిఎఫ్ నాయకులు బాబు, సీతామహాలక్ష్మి, శ్రీనివాసులు, మారుతి, వర కుమారి, సుబ్బారెడ్డి, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : మడకశిర మండలం ఆమిదాలగొంది ప్రధానోపాధ్యాయులు డి.జాబేజ్ పై విధించిన సస్పెన్షన్ వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రధానోపాధ్యాయుల సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ విషయంపై సోమవారం జిల్లా విద్యాశాఖ అధికారి కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుల సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ, ఆమిదాల గొంది సంఘటనకు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాబేజ్ ను బాధ్యులుగా చేస్తూ ఉన్నతాధికారులు సస్పెండ్ చేయడం తగదన్నారు. ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేసే వారికి తీవ్ర పని ఒత్తిడి ఉందన్నారు. ఉన్నతాధికారులు వెంటనే తగిన చర్యలు తీసుకొని జాబేజ్ పై విధించిన సస్పెన్షన్ ఎత్తివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు కేశవమూర్తి, నాగార్జునుడు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కర్నాటక మద్యం విక్రేత అరెస్టు

ప్రజాశక్తి-పెనుకొండ

గోరంట్ల మండలంలోని పాలసముద్రం క్రాస్ వద్ద కర్నాటక మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి మద్యం స్వాధీనం చేసుకున్నారు. పెనుకొండ ఎక్సైజ్ సిఐ సృజనబాబు తెలిపిన వివరాలు.. పాలసముద్రం క్రాస్ వద్ద కర్నాటక మద్యం విక్రయిస్తున్న ఎం.తిప్పన్నను అదుపులోకి తీసు కుని అతడి నుంచి రూ. 80వేల విలువ చేసే 20 బాక్సుల టెట్రా ప్యాకెట్లు(1920) స్వాధీనం చేసుకు న్నారు. సిఐ మాట్లాడుతూ కర్నాటక మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు. దాడుల్లో ఎస్ఐలు రాజశేఖర్, రాముడు, హెడ్ కానిస్టేబుళ్ల జనార్ధన్, రమేష్, ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్లు సీజ్

ప్రజాశక్తి - బత్తలపల్లి

మండలంలోని రామాపురం గ్రామ సమీపంలోనిచిత్రావతి నది నుండి ఇసుకను అక్రమంగా తీసుకు వెళుతున్న టిప్పర్లను సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. సోమవారం తెల్లవారుజామున చిత్రావతి నది నుండి అక్రమంగా ఇసుకను తీసుకు వెళుతున్న మూడు టిప్పర్లను సీజ్ చేసినట్లు బత్తలపల్లి ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. అనంతపురానికి చెందిన వ్యక్తులు మూడు టిప్పర్లలో ఇసుక తీసుకువెళు తున్నట్లు ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్‌కు సమాచారం అందడంతో ఆయన ఆదేశాల మేరకు తన సిబ్బందితో మూడు ఇసుక టిప్పర్లను గుర్తించి పోలీస్ స్టేషన్ కు తరలించినట్లు తెలిపారు.

మాలధారులకు అన్నదానం

ప్రజాశక్తి-హిందూపురం

అయ్యప్ప మాలధారులకు అన్నదానం నిర్వహించడం అభినందనీయమని లేపాక్షి దుర్గాలయ కమిటీ చైర్మన్ కరణం రమానంద స్వామి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని బెంగళూరు రోడ్డులో ఉన్న అయ్యప్పస్వామి దేవాలయంలో మాలధారులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురు స్వాములు, అన్నదాన కమిటీ అధ్యక్షులు డిఈ రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహశీల్దార్‌గా మైనుద్దీన్

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం డిప్యూటీ తహశీల్దార్‌గా మైనుద్దీన్ సోమవారం బాధ్యతలను స్వీకరించారు. పుట్టపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల విభాగంలో విధులు నిర్వహిస్తున్న మైనుద్దీన్ హిందూపురానికి బదిలీ అయ్యారు. ఇక్కడ డిప్యూటీ తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లు ను జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రిపోర్ట్ చేసుకోవాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. మైనుద్దీన్‌కు హిందూపురం తహశీల్దార్ కార్యాలయంలో గతంలో పనిచేసిన అనుభవం ఉంది.

ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించాలని వినతి

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తి పట్టణంలో అయ్యప్ప స్వామి దేవాలయ నిర్మానానికి స్థలం కేటాయించాలని అయ్యప్ప మాలాధారులు కోరారు. ఈ మేరకు వారు సోమవారం ప్రజా సమస్యల ఫిర్యాదు వేదికలో కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అయ్యప్ప స్వామి దేవాలయానికి స్థలం కేటాయించాలని ఎమ్మెల్యే సింధూర రెడ్డిని కోరగా, ఎనుములపల్లి పొలంలో సర్వే నంబర్ 9 లో చదును చేసుకోవాలని చెప్పారన్నారు. ఆ స్థలం చదును చేస్తుండగా రెవెన్యూ అధికారులు వచ్చి నిలిపివేశారన్నారు. పట్టణంలో దాదాపు 560 మంది అయ్యప్ప స్వామి భక్తులు ఉన్నారన్నారు. కలెక్టర్ స్పందించి అయ్యప్పస్వామి దేవాలయ నిర్మాణానికి సహకరించాలని కోరారు.

హాస్టళ్ల మరమ్మతులకు నిధులు మంజూరు

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

ధర్మవరం నియోజకవర్గంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల మరమ్మతుకు రూ.1,18,30,000లు మంజూరైనట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నియోజకవర్గ పరిధిలోని తాడిమర్రి బాలుర వసతి గృహం, ధర్మవరంలోని బాలుర వసతిగృహం, బాలికల వసతి గృహాలతో పాటు సాంఘిక సంక్షేమ బాలుర కళాశాల వసతి గృహాల భవనాలు శిథిలావస్థలో ఉన్నాయన్నారు. ఈ సమస్యను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల శ్రీ బాల వీరాంజనేయ స్వామి దృష్టికి తీసుకెళ్లి భవనాల మరమ్మతు కోసం నిధులు మంజూరు చేయించినట్లు మంత్రి చెప్పారు. ధర్మవరం ప్రాంతంలో విద్యాభివృద్ధి కోసం త్వరలో మరిన్ని కార్యక్రమాలు చేపడతానని మంత్రి అన్నారు.

బ్యుటీషియన్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-హిందూపురం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో బ్యూటిషన్ కోర్సులో శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ హరీష్ బాబు సోమవారం తెలిపారు. కోర్సులో అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం అనంతరం సర్టిఫికెట్ కూడా అందజేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే కళాశాలలో ఇందుకు సంబంధించి అడ్మిషన్లు, రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ నెల రెండో వారంలో తరగతులు ప్రారంభమవుతాయని చెప్పారు. 10వ తరగతి, ఆపై చదివి, 18 నుండి 35 సంవత్సరాల లోపు యువతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాల కోసం పట్టణంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో లేదా 9704778737 నెంబర్ ను సంప్రదించాలని ఆయన సూచించారు.

14న జాతీయ మెగా లోక్ అదాలత్

ప్రజాశక్తి-హిందూపురం

ఈ నెల 14వ తేదీన హిందూపురం న్యాయస్థానంలో నిర్వహించే జాతీయ మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక సీనియర్ సివిల్ జడ్జి మానిపాటి శ్రీధర్, జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం స్థానిక సబ్ కోర్టు ఆవరణలో మెగా లోక్ అదాలత్ నిర్వహణపై పోలీసులు, కోర్టు సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ, ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు ఈ నెల 14వ తేదీన హిందూపురం న్యాయస్థానంలో జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. పోలీసులు రాజీ అయ్యేందుకు అవకాశం ఉన్న కేసులను గుర్తించి ఇరు వర్గాలతో చర్చించి పరిష్కారమయ్యే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే నిర్దేశించిన లక్ష్యాల మేరకు పోలీసులు కేసుల పరిష్కారంలో చొరవ చూపాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ నగేష్, వివిధ స్టేషన్ల పోలీసులు, లోక్ అదాలత్ శారద, వివిధ న్యాయస్థానాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సాఫ్ట్ స్కిల్స్ కోర్సులు

ప్రజాశక్తి - బుక్కపట్నం

ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ సీడ్ యాప్ సంయుక్తంగా సిసి టీవీ, సాఫ్ట్ స్కిల్స్ కోర్సులు ప్రారంభిస్తున్నట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మక్బూల్ హుస్సేన్, నైపుణ్య అభివృద్ధి అధికారి హరికృష్ణ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని శ్రీ సత్య సాయి ప్రభుత్వడిగ్రీ కళాశాలలో స్కిల్ హబ్ ప్రారంభిస్తున్నామని చెప్పారు. ఐటిఐ, ఇంటర్ ,డిగ్రీ ,పాస్ లేదా ఫెయిల్ అయిన వారు ఈ కోర్సులను నేర్చుకోవడానికి అర్హులు అనితెలిపారు. కోర్స్ వ్యవధి మూడు నెలలు పూర్తయిన తర్వాత ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న యువతి యువకులు తమ ఆధార్ లింక్ కలిగిన మొబైల్ నెంబర్, ధ్రువీకరణ పత్రాలతో స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ ను 7981541994సంప్రదించాలని కోరారు.

అవగాహనతో ఎయిడ్స్ దూరం

ప్రజాశక్తి- హిందూపురం

అవగాహనతో ఎయిడ్స్‌ను దూరం చేయడానికి సాధ్యం అవుతుందని ప్రిన్సిపల్ డాక్టర్ జియావుల్లా ఖాన్ అన్నారు. సోమవారం పట్టణంలోని బాలయేసు కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతు ఎయిడ్స్ వ్యాధిపై అందరూ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ప్రోగ్రాం అధికారి అశ్వర్థ నారాయణ ఎయిడ్స్ పై అవగాహన గేయాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో హరీష్, శివరామ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : ఆర్‌డిటి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఎస్‌డిఆర్‌ఆర్ కళాశాలలో ప్రపంచ హెచ్ఐవి ఎయిడ్స్ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఇషాక్, కళాశాల ప్రిన్సిపల్ మల్లిఖార్జునరెడ్డి, అధ్యాపకులు, ఆర్డీటీ ఎటిఎల్ కృష్ణ, ఎస్‌టిఎల్ కావేరి, సిఒలు జయప్రకాశ్, రమణ, శ్రీరాములు పాల్గొన్నారు.